# చదువు

గల్లా పెట్టెలోకి పోయే రూపాయి బిళ్ళలా, సూర్యుడి చక్రం సర్రున కిందికి పోతోంది.

నీలి ఆకాశం స్వచ్ఛంగా వుంది. చంద్రుడు పొడిచాడు.

రంగూన్ కట్టెతో తాతలనాడు చేయించి నగిషీలు చెక్కించిన పడక్కుర్చీ చేతులమీద కాళ్ళు బారసాచుకుని కూర్చుని వున్నాడు షావుకారు నారయ్య.

ఆయన కెదురుగా నడుం విరిగిన అల్పజీవిలా చేతులు కట్టుకుని, మెడవంచి - సీతయ్య నిలబడి వున్నాడు.

అర్ధగంట గడిచింది.

చుట్ట నుసిని పక్కన విదిలిస్తూ కుర్చీలో ముందుకు లేచేడు నారయ్య. ఒకసారి సకిలించాడు.

వినయంగా తలని వొక మిల్లీమీటరు పైకెత్తి చూశాడు, సీతయ్య.

" అంటే నేను నీకు అన్యాయం చేశానంటావ్ ? " షావుకారు మాటలకి గజగజలాడిపోయాడు సీతయ్య. కళవళ పడ్డాడు. తనలో తను ఏదో గొణుక్కున్నాడు. చిత్రంగా చేతులు గాల్లో వూపేడు. "అదిగాదయ్యా – ఆ వడ్డీ గురించే నా బాధ..." నూతిలోనుంచీ వచ్చినట్లు హీనంగా వుంది స్వరం. సీతయ్య నారయ్యకేసి చూశాడు. నారయ్య సీతయ్యని చూడనట్లు లేచి నిలబడ్డాడు. ఒకటి రెండు అడుగులు కదిలాడు సీతయ్య.

" నీకు నేను ఆ రోజునే చెప్పాను – ధర్మవడ్డీ మాత్రమే తీసుకుంటానని. కాకుంటే అదే నీకు ఎక్కువనిపిస్తోంది. దానికి కారణమేవిటో తెలుసా ? నీ అవసరం గడిచిపోయింది. అందుకని అది భారంగా వుంది. ఈశ్వరమ్మ పెళ్ళికి ముందు అప్పు తీసుకునేటప్పుడు వడ్డీ గురించి చెప్తే, చాలా ఆనందంగా అట్టాగే కానియ్యండయ్యా అని నోటుమీద ముద్రేశావ్. ఇవ్వాళ నేనేదో అన్యాయంగా వడ్డీ తింటున్నట్టు మాట్లాడుతున్నావ్. ఏరు దాటి తెప్ప తగలెయ్యడమంటే ఇదేగదూ ! "

నారయ్య విసుగుదలా, కోపం సీతయ్యని నోరెత్తనియ్య లేదు. పది నిముషాలపాటు నీళ్ళు నమిలీ, చేతులు నలుపుకునీ అస్థిమితంగా నిలబడ్డాడు.

ఆ తర్వాత నిమ్మళంగా జేబులో డబ్బుని నారయ్య చేతికి భయంభయంగా అందించి వెనక్కి తిరిగాడు. గబగబా అడుగులు వేసుకుంటూ అక్కణ్ణుంచీ కదిలాడు.

* * *

తన పనేమో తాను చేసుకుపోయే తత్వం సీతయ్యది. సీతయ్యకు తగిన భార్య పార్వతి.

వాళ్ళకు కొద్దిగా భూవసతి వుంది. భార్యాభర్తా కలిసి సేద్యం చేస్తారు. ఇద్దరూ రెక్కల కష్టానికి సిద్ధమే. తమకు పని లేనప్పుడు కూలీనాలీ చేస్తారు.

సీతయ్యకి ముగ్గురు పిల్లలు - తొమ్మిదీ, ఏడూ, ఐదేళ్ళ వాళ్ళు. కడగొట్టుది ఆడపిల్ల. పెద్దోడు వ్యవసాయ పనుల్లో తండ్రి పక్కనుంటాడు.

సీతయ్యకి చిన్న మట్టిగోడల పూరిల్లు వుంది. తిండికి లోటుపడకపోయినా, సీతయ్యకి జీవనంలో ఒక స్థాయి దొరకడం లేదు. అయినా, మొగుడూ పెళ్ళాలది ఒకటే భావన. "తాహతు కొద్దీ సంసారం గాల్లో పోవాలంటే కుదరదు. జంబంగా పోగూడదు" సీతయ్యకి పార్వతీ, పార్వతికి సీతయ్యా చెప్పుకునే హెచ్చరిక ఇది.

సీతయ్యకి ఒక చెల్లెలుంది – ఈశ్వరమ్మ. రెండేళ్ళ క్రితం ఆ పిల్లకి పెళ్ళి చేశారు. బావమరిది సీతయ్యకి పాత బంధువే. పిల్లోడు బాగుంటాడు. పట్నంలో ఫాంక్టరీలో పని చేస్తాడు. మంచి సంబంధమని సంతోషంగా తమకున్న ఎకరా తోటని బావమరిది పేరన రాయించే ఏర్పాటుకి వొప్పుకున్నాడు సీతయ్య. పార్వతీ ఇష్టపడింది. పెళ్ళి ఖర్చులకు షావుకారు ముందు నిలబడక తప్పలేదు సీతయ్యకి. చాలా షరతులతో

రెండు వేల రూపాయలిచ్చాడు నారయ్య. పెళ్ళి అయిపోయింది. తిరుగుమరుగులూ అయినాయి. చెల్లెలు కాపరానికి వెళ్ళిపోయింది. ఉన్నంతలో ఏ లోటూ లేకుండా చూశారు.

ఏడాది గిర్రున తిరిగొచ్చింది.

వడ్డీ కోసం కబురుపెట్టాడు నారయ్య. చేతికొచ్చిన పంటలో సగం దానికే సరిపోయింది. గుడ్లు చేతికొచ్చినట్లైంది సీతయ్యకి.

ఖర్చులు పెరుగసాగిన్నై సీతయ్యకి. ఖర్చులతోపాటు గుండెల్లో గుబులూ పెరుగసాగింది.

కార్తె వెళ్ళి కార్తె వస్తోంది. వానలు సరిగా పళ్ళేదు. సంకురాత్రి వచ్చింది, షావుకారు కబురూ వచ్చింది.

కాళ్ళీడ్చుకుంటూ భారంగా వెళ్ళాడు సీతయ్య. షావుకారు ముందు తన బాధని వెళ్ళబోసుకున్నాడు.

నిష్టూరాలూ, బెదిరింపులూ తప్ప ఫలితమేమీ లేదు. సీతయ్యకి దిక్కు తెలీడంలేదు. ఆలోచనలు అధికమైన్నై. వాటితో పాటు చిరాకూ ఎక్కువైంది. వడ్డీని తలచుకుంటేనే వడి గల గుర్రాలు గుర్తుకొస్తా వున్నై.

కాలం బరాబర్లు చేసుకుంటూ మరో సంవత్సరం మీదుగా తొక్కుకుంటూ తోసుకుంటూ వెళ్ళిపోయింది.

* * *

ఈశ్వరమ్మకి వేవిళ్ళని ఉత్తరంవొచ్చింది.

పార్వతి సంబరపడింది. సీతయ్యకీ సంతోషంగానే వుంది. కానీ మనసులో గుబులుగా వుంది.

అసలే ఈ ఏడు అదునులో వర్షం పడలేదు. పంట చేతి కొచ్చేదాకా నమ్మకంలేదు. తాలూతప్పా పోతే రాలే గింజలు తిండికే అంతంత మాత్రం కావచ్చు. ఖర్చులు పెరుగుతూవున్నై. ఇదీ సీతయ్య దిగులు.

పిల్లని తీసుకొచ్చి అచ్చటా ముచ్చటా చూశారు. చెల్లెలి పురుడుపోసి పట్నం పంపేసరికీ సీతయ్య దిగజారిపోయినాడు. కష్టపు కానుపై ఈశ్వరమ్మని ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. గత్యంతరంలేక నారయ్య దగ్గర మళ్ళీ అప్పు చేశాడు.

"డబ్బు పోతే పోయింది. తల్లీ పిల్లా కులాసాగా ఇంటికి చేరారు. అంతేచాలు" అని తృప్తిపడింది పార్వతి.

ఈ కష్టం గట్టెక్కేసరికీ పార్వతి నీళ్లోసుకుంది.

కాలచక్రం తిరుగుతోంది.

సీతయ్య అప్పుల్లో మునిగి తేలడానికి అలవాటు పడుతున్నాడు.

పుట్టపాగ పక్కనుంచీ, బుర్రమీసాల సందుల్లోంచీ సన్నగా నవ్వుకుంటూ, రొప్పుకుంటూ, సీతయ్యని దెప్పుకుంటూ కాగితాలమీద ముద్దర్లు తీసుకుంటావున్నాడు నారయ్య.

మరో మూడేళ్ళు గడిచాయి.

ఏమీ చేయలేని స్థితిలో పడ్డాడు సీతయ్య. ఉన్న పొలాన్ని బేరం పెట్టాడు. కానీ, అప్పులో ధర పలుకుతుందా? లేదు. నారయ్యనే ప్రతిమాలి భంగపడ్డాడు.

తీరా బేరసారాలైనాక తెలిసింది - ఆ వార్త. ఈశ్వరమ్మ పెళ్ళికి తను తీసుకున్న అప్పు రెండువేలైతే, నాలుగు వేలంటాడు నారయ్య. అదేమని నిలదీస్తే ఇదిగో నోట్లు అన్నాడు. సమ్మెట దెబ్బలా వుంది ఈ వ్యవహారం సీతయ్యకి. తల దిమ్మెక్కింది. దిక్కు తోచలేదు. దానికి తోడు చెల్లించని వొడ్డీ మానులా పెరిగింది.

సీతయ్య విలవిల్లాడిపోయాడు. షావుకారు చేసిన మోసానికి కోపం, కసి, ద్వేషం, దుఃఖం, బాధా కలిగాయి. వడ్డీరూకలు చెల్లించలేక పొలం పోగొట్టుకోబోతున్న వాడికి ధైర్యం వుండదు. అందుకే తలవంచుకున్నాడు సీతయ్య.

కళ్ళనీళ్ళతో కాయితాలమీద ముద్దర్లేశాడు సీతయ్య. రెండెకరాల మంచి రేగడిగడ్డా జారిపోయింది.

* * *

ఇప్పుడు సీతయ్య కేవలం వ్యవసాయ కూలీ. కూటికి కూలీయే ఆధారమైంది. సంసారం పెరిగింది. ఇప్పుడు మొత్తం ఏడు కడుపులు నిండాల.

సీతయ్యకి ఎప్పుడూ ఏదో దిగులు. ఒబ్బిడంగా వుండటమే లేదు. పార్వతే నయం — నారు పోసినవాడు నీరుపొయ్యడా అనే

ధైర్యం ఆమెది. ఉన్నంతలో గుట్టుగా కాపరం సాగిస్తోంది. అక్కడా ఇక్కడా ఏదో పనిజేస్తావుంటుంది. ఏ పనీ దొరకనప్పుడు రాళ్ళేరే దానికైనా పోతాది. చేతిలో నాలుగురాళ్ళు చూస్తాది.

పార్వతిది పొందికయిన చెయ్యికూడా. రూపాయిని చూసుకుని ముప్పావలా ఖర్చు చేస్తుంది. పెద్ద పిల్లోళ్ళని పనుల్లోకి దింపింది.

పైసాకు పైసా కలిపి నాలుగు రూకలు కొంగున కట్టింది పార్వతి. భార్య తెలివితేటలే సీతయ్యకిప్పుడు మిగిలిన ఆస్థి.

పల్లెలోకి సర్రున దూసుకొచ్చింది మోటార్ సైకిల్.

మోటార్ సైకిల్ మీద గోపాల్రావు.

గోపాల్రావు ఏదో కంపెనీకి ఇన్స్పెక్టరు.

ఆ కంపెనీ వాళ్ళు ప్రజలచేత డబ్బుని పొదుపు చేయిస్తారు.

పిల్లలు కేరింతలు కొట్టూ మోటార్ సైకిల్ చుట్టూ చేరేరు. బండిని నీడలో నిలిపి రామాలయం అరుగుమీద కూర్చున్నాడు గోపాల్రావు.

ఎల్లయ్యా, పుల్లయ్యా, రాజెమ్మా, రంగమ్మా గోపాల్రావుకి డబ్బు చెల్లించడం మొదలెట్టారు.

నెమ్మదిగా వచ్చింది పార్వతి. అంతా గమనించింది. ఏవో తెలీని ప్రశ్నలడిగింది గోపాల్రావుని. అతనెంతో వోపిగ్గా వివరాలు చెప్పాడు. తమ కంపెనీ గొప్పదనం చెప్పాడు. తన గొప్పదనం చెప్పాడు. ఆ వూరివాళ్ళ మంచిదనం గురించీ మధ్య

మధ్యలో చెప్పాడు. వాళ్ళందరి సంక్షేమం కోసం తనెంత నిస్వార్థంగా పన్జేస్తున్నదీ ఎమ్మెల్యేలా చెప్పాడు. బీదాబిక్కీ ప్రజలకి పొదుపే శరణ్యం అన్నాడు. దాన్లో మళ్ళీ తమ కంపెనీ పథకాలే మరీ శరణ్యం అన్నాడు.

పార్వతి కళ్ళు విచ్చుకుని చూసింది; చెవులు రిక్కించుకుని విన్నది. ఆమె మేధస్సులో అనేకానేక ఆలోచనలు మొలిచినై. కొంగున దాచుకున్న నాణేలూ, గూట్లో దాచిన రూకలు గుర్తు కొచ్చినై. వాటన్నిటినీ సంరక్షించి, పెంచి వృద్ధిచేసే మహత్తర మైన అవకాశాన్ని గోపాల్రావు మాత్రమే కల్పించగలడని విశ్వాసం కుదిరింది. రంగమ్మా, రాజెమ్మా వత్తాసుగా నాలుగు మాటలు చెప్పారు.

అయినా, ఆ రోజుకు నిభాయించుకుంది, పార్వతి. రాత్రికి సీతయ్యకు చెప్పింది. చెప్పిన సంగతి చెప్పకుండా, విన్నదీ, కన్నదీ - బీరుపోకుండా చిత్రచిత్ర భంగిమలతో చెప్పింది. కళ్ళల్లో వెలుగులు నింపుకుని చెప్పింది. గుండెల్లో కోటి కోరికల్ని నింపుకుని చెప్పింది. ఆలోచనల్లో శతకోటి ఆశల్ని నింపుకుని చెప్పింది. పలుకులో సంబరాన్నీ సంతోషాన్నీ నింపుకుని చెప్పింది.

ఓపిగ్గా విన్నాడు సీతయ్య. నిమ్మళంగా పార్వతి కళ్ళల్లోకి చూస్తూ తన సందేహాన్ని బయటపెట్టాడు - "ఆ గోపాల్రా వెట్టాంటోడో, ఆయనకిస్తే మన డబ్బు మనకి తిరిగొస్తదా చివరికి?"

తాటి ప్రమాణంగా లేచిన పార్వతి ఉత్సాహం మీద నీళ్లు చల్లినట్లయింది. ఆమె ఋంగమూతి పెట్టుకుంది. కావాలంటే పుల్లయ్యని కనుక్కోమంది. వాళ్లంతా చాలాకాలం నుంచీ అతనికి డబ్బులిస్తున్నారంది. ఇకనన్నా తమకు కాస్తంత ముందుచూపు కావాలంది.

"సరే చూద్దాంలే. ఈసారి గోపాల్రావు వచ్చినప్పుడు అడుగుతాన్లే" అని నడుం వాల్చాడు సీతయ్య.

వారం రోజులు ఇట్టే గడిచిపోయినై.

గోపాల్రావు వచ్చాడు.

సీతయ్య తన సందేహాలన్ని అడిగేడు. పార్వతీ వుంది. అన్నిటికీ సమాధానాలు చెప్పాడు గోపాల్రావు.

అంతా అయిన తర్వాత, "నువ్విచ్చే రశీదు కాయితం చెల్లుతుందో లేదో ఎట్టా?" అన్నాడు సీతయ్య.

గోపాల్రావు గతుక్కుమన్నాడు. కళవళపడ్డాడు. క్షణం తర్వాత తెప్పరిల్లుకున్నాడు. "నీకంత అనుమానంగా వుంటే నా బండిమీద టౌన్‌కి పోదాం. అక్కడ బ్యాంక్‌లో నువ్వే చెల్లించవచ్చు. వాళ్ళే రశీదిస్తారు" అన్నాడు.

సీతయ్యకి ఈ పద్ధతి నచ్చింది. సరే అట్టాగేనని బయల్దేరాడు. డబ్బు తీసిచ్చింది, పార్వతి. లెక్కేస్తే రెండొందల యాభై అయింది. భార్యకేసి మెచ్చికోలుగా చూశాడు సీతయ్య. "నువ్వెట్టాగైనా జాగ్రత్త మంతురాలివి" అన్నాడు.

గర్వంగా, సిగ్గుగా నవ్వుకుంది పార్వతి.

గోపాల్రావు బండి వెనకాల కూర్చున్నాడు సీతయ్య. మోటార్ సైకిల్ దుమ్ము రేపుకుంటూ ముందుకు సాగింది. తృప్తిగా ఆ వైపు చూస్తూ నిలబడింది పార్వతి.

* * *

తాము అప్పటివరకూ సంపాదించుకున్న బ్యాంక్ రశీదుల్ని చూసుకుంటూ మురిసిపోసాగేరు, సీతయ్య, పార్వతి.

పార్వతికి ఎన్నెన్నో ఆశలు - భవిష్యత్తు మీద. పెద్ద కూతురికి పట్టుపరికిణీ కొనాలనీ, మెళ్లోకేదన్నా చిన్న గొలుసు చేయించాలనీ, చెవులకి లోలకులు పెట్టాలనీ...ఇలా...

సీతయ్యకీ ఆశలున్నై. పడిపోతున్న ఇంటి గోడల్ని మళ్ళీ పెట్టుకోవాలనీ, కప్పుని తిరక కప్పించాలనీ...ఇలా...

"వెయ్యి దాటింది గదా - ఆలోచిద్దాం" అనుకున్నారు.

మరో నెల గడిచేసరికీ -

ఊరు గొల్లుమంది.

రాజెమ్మా రంగమ్మా - ఎల్లయ్యా పుల్లయ్యా అంతా గొల్లుమన్నారు.

గోపాల్రావు కంపెనీకేం డబ్బు కట్టలేదుట. తన సొంత వూరు ఎక్కడో తమిళనాడులో పల్లెకో ఎక్కడికో పారిపోయాడట. ఎక్కడున్నాడో ఎవరికీ తెలీదు - ఇదీ వార్త.

తాము – డబ్బుని బ్యాంకులో కట్టి మంచిపనే చేశామని తృప్తిపడి నిట్టూర్చారు – సీతయ్యా, పార్వతీ.

గుండెల్లో వో మూలవున్న కొద్దిపాటి సందేహాన్ని పారద్రోలుకోవడం మంచిదని రశీదుల్ని తీసుకపోయి నారయ్యకి చూపించింది పార్వతి.

నారయ్య అదోలా నవ్వేడు. పార్వతి గుండెలు అదిరినై. గబుక్కున ఆ కాగితాల్ని లాక్కుని పరిగెత్తుకొచ్చింది – నారయ్య చెప్పబోయే మాటల్ని వినకుండానే.

సీతయ్యా, పార్వతీ టౌనుకొచ్చారు. వాళ్ళ ప్రాణం కళ్ళల్లో వుంది. బ్యాంక్ వాళ్ళని అడిగేరు.

సీతయ్య చెల్లించిన డబ్బంతా ఎప్పటికప్పుడు గోపాల్రావు ఖాతాకి జమ అయి కూర్చుంది. ఆ రశీదులన్నీ మరి అతను రాసి బ్యాంక్‌లో చెల్లించినవే గదా.

మొగుడూ పెళ్ళాలకి ఏడుపు ముంచుకొచ్చింది. నెత్తీ నోరూ కొట్టుకున్నారు. కనపడిన వాళ్ళకల్లా కాగితాలు చూపించారు. అంతా 'అయ్యో పాపం' అని పక్కకిపోయారు.

తాము రెక్కలు ముక్కలు చేసుకుని వెనకేసిన డబ్బు – పిల్లల పెళ్లి నాయగట్టి దాచుకున్న డబ్బు –

సీతయ్యా, పార్వతీ పిచ్చివాళ్ళే అయిపోయారు.

వాళ్ళ ఆశాసౌధాలన్నీ కూలిపోయినై.

చేతిలో రశీదుల్ని పట్టుకొని పిచ్చివాడిలా చూస్తున్నాడు సీతయ్య. వాటితోపాటు నారయ్య యిచ్చిన ప్రామిశరీ నోట్లూ వున్నై. వాటివంక పదేపదే పిచ్చిచూపులు చూస్తున్నాడు.

ఉన్నట్టుండి గొల్లున నవ్వేడు. ఆపేడు. మళ్ళీ నవ్వేడు. ఈసారి వేదాంతిలా నవ్వేడు.

" అవును. అవును. ఈ కాగితాల్ని చూసుకుంటే చాలదు. చదువుకోవాల. అవును. కాగితాల్ని చదువుకోగలగాల. చదువుకోవాల. "

సీతయ్య పెద్దగా వెర్రిగా అరిచేడు.

భారంగా లేచి సందెదీపం పెట్టింది, పార్వతి !

ఆ దీపపు వెలుగులో రేపు వెలిగే అక్షరాల్ని చూస్తోంది - ఆమె చూపు !

అవును. ఆమె చూపు రేపటి వైపు ! !

0o0